www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
అన్నమయ్య



ఎటిఎస్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం పట్టణంలోని వరిగ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎటిఎస్ టెస్టింగ్ స్టేషను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఆటోమోటెడ్ టెస్టింగ్ స్టేషన్ ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నారిని చిదిమేసిన మృగం

అయ్యో పాపం ఆమె చిట్టి చేతులు ఇంకా బొమ్మలతో ఆడుకోవాల్సింది. తన అందమైన చూపులతో బంగారు భవితను చూడాల్సింది. అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన చిట్టితల్లి..అప్పటిదాకా..నవ్వుల పువ్వులు విరబూయించిన పాపాయి. కామాంధుడి కబంద హస్తాల్లో చిక్కి విలవిల్లాడింది. అరటి పండు ఆశచూపిన దుర్మార్గుడి దుష్ట చర్యలకు బలైంది. రాక్షసుడి క్రూరత్వం..మానవత్వానికి మాయని మచ్చయింది. అభం శుభం తెలియని పసికందు మరణం ప్రతి హృదిని ద్రవింపజేసింది.



- నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం..ఆపై హత్య
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఎన్‌కౌంటర్ చేయాలని బాధితుల డిమాండ్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

అభం శుభం తెలియని చిన్నారి...అమ్మ, నాన్నలతో కలిసి పెళ్లికి వచ్చి మానవ మృగం చేతిలో నలిగి చనిపోయిన సంఘటన కడప జిల్లా జమ్మలమడుగు నియోకవర్గం, మైలవరం మండలం ఎ.కంబాలదిన్నే గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. శుక్రవారం కడప జిల్లా ప్రొద్దుటూరులోని అమృతనగర్‌కు చెందిన దంపతులు వారి నాలుగేళ్ల కుమార్తెను వెంటబెట్టుకొని బంధువుల పెళ్లి నిమిత్తం మైలవరం మండలం కంబాలదిన్నేకు వెళ్లారు. చిన్నారి పెళ్లి మండపం బయట ఆడుకుంటున్న సమయంలో మోరగుడికి చెందిన తలారి రహమతుల్లా అలియాస్ కబీర్ అరటి పండు ఇస్తానని ఆశ చూపించి ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం బయటపడుతుందని చిన్నారిని హత్య చేశాడు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలో గాలించారు. ముళ్ల పొదల్లో చిన్నారి మృత దేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపి ంచారు. సమాచారం తెలుసుకున్న మైలవరం మండలం తలమంచి పట్నంకు చెందిన పోలీసులు హుటాహుటిన వెళ్లి సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. నింది తుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి మృతదేహాన్ని సజమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తల్లిదండ్రులు ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు రహమతుల్లా (ఫైల్)

నిందుతుడిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

మైలవరం మండలంలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో చోటు చేసుకున్న దుర్ఘటన చాలా బాధకరమైందని సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని శిక్షించాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై హోం శాఖ మంత్రి స్పందించి ఆ చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షంచాలని ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు నరేంద్ర, మధు డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపుదాం

- విస్తరణ అంతరాలను తగ్గించే దిశగా పరిశోధనలు
- రైతులు పెట్టుబడుల తగ్గింపుపై దృష్టి పెట్టాలి
- ఉత్పత్తుల నాణ్యత పెరిగితే ఎగుమతులకు అవకాశం
- విలువ ఆధారిత ఉత్పత్తి లాభదాయకం
- పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో శాస్త్రవేత్తలు, అధికారులు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పరిశోధన, విస్తరణ అంతరాలను తొలగింపు దిశగా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా రైతుల ఆదాయం పెంచడానికి వీలు అవుతుందని అభిప్రాయ పడ్డారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం రాయలసీమ జోన్ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు, సూక్ష్మనీటి పథకం (ఎపిఎంఐపి) అధికారులు హాజరై రైతులతో చర్చించారు. రైతుల సమస్యలకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కె.టి.వెంకట రమణ మాట్లాడుతూ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలను ప్రాంతాల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. జూన్ మొదటి వారంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి ప్రాంతీయ సదస్సుల ద్వారా వచ్చిన సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశాల ద్వారా పరిశోధన, విస్తరణ అంతరాలను గుర్తించి వచ్చే ఏడాది చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పరిష్కారం లేని సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పరిశోధనలపై కార్యచరణ చేపడతామన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ రైతులు తాము ఎదుర్కొంటున్న ఉద్యాన పంటల సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. వివిధ పంటల నిపుణులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు రైతుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారన్నారు. రాయలసీమను ఉద్యాన సీమగా రూపొందించడానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సహపరిశోధన సంచాలకులు డాక్టర్ సి.మధుమతి మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలను ప్రత్యక్ష పద్దతిలో నిర్వహిస్తున్నామని, రైతులు తమ సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ఏడాది ప్రాంతీయ సలహామండలి సమావేశంలో వివిధ ఉద్యాన పంటలకు సంబంధించి రైతుల తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు, వాటికి చేపట్టిన చర్యలను వివరించారు. అన్నమయ్య జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు రవిచంద్రబాబు మాట్లాడుతూ రైతుల పంట పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయని దానికి తగ్గట్లు ఆదాయం రావడంలేదన్నారు. రైతులు పెట్టుబడి తగ్గించుకోవాలని సూచించారు. ఖర్చు పెరగడం తగిన గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గించుకొనే దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టాలని సూచించారు. పంట నాణ్యత పెరిగేలా, ఎగుమతిలకు అనుకూలమైన ఉత్పత్తి వచ్చేలా చూడాలని కోరారు. నెల్లూరు జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు సుబ్బారెడ్డి తన ప్రసంగంలో నిమ్మ, మామిడి ఇతర ఉద్యాన పంటలలో వచ్చే తెగుళ్లను ప్రస్తావించారు. తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు దశరథరామిరెడ్డి, సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు చంద్రశేఖర్, వైఎస్ఆర్ జిల్లా సంచాలకులు సుభాషిణి, చిత్తూరు జిల్లా సంచాలకులు మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా సంచాలకులు ఫరోజ్ ఖాన్, నాగరాజు (నంద్యాల), కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ కె.ఎం.యువరాజు, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.శ్యాంసుందర్ రెడ్డి, అనంతపురం, మహానంది, పులివెందుల, గుంటూరు ఉద్యాన పరిశోధన స్థానాల అధిపతులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ శివరామ కృష్ణ, డాక్టర్ రమణ, పెరియవరం, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఉద్యాన కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, డాక్టర్ రూత్, డాక్టర్ గిరిధర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ముకుంద లక్ష్మి, డాక్టర్ జి.శారద, డాక్టర్ కె.లలిత, డాక్టర్ శిరీష, డాక్టర్ దీప్తికిరణ్ పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్



రాయచోటి : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఇంటికి వెళ్లి తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, ఈ విషయంలో ప్రజలలో అవగాహన పెంచాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతపురం పంచాయతీలోని చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో ఎన్ని హాబిటేషన్స్, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎంతమంది క్లాప్ మిత్రలు ఉన్నారు, రోజువారీ చెత్త సేకరణ చేస్తున్నారా, వారానికి ఎన్ని రోజులు చెత్త సేకరణకు వెళ్తున్నారు, ఎన్ని వాహనాలు ఉన్నాయి, సేకరించిన చెత్త సెగ్రిగేషన్ చేస్తున్నారా లేదా, నేడు సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేశారని కలెక్టర్ ప్రశ్నించగా పంచాయతీ సెక్రటరీలు సరిగా సమాధానాలు చెప్పలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఉన్నత అధికారుల ఆదేశాలు కూడా పాటించకపోవడంతో అనంతపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎం.మధుసూధన, మద్దిరేవుల గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఎం.ఎన్.రజనీష్‌రెడ్డిలను సస్పెండ్ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ ఉద్యాన పంటలపై సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ సమీక్షలో భాగంగా వారం రోజుల ప్రగతిని సమీక్షించారు. పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవడానికి బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనంగా ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శివయ్య, డిఎస్ఒ రఘురాం, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఉషా రాణి, తహశీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్కర్ష అభయాన్-25ను పక్కాగా అమలవ్వాలి

రాయచోటి: జిల్లాలో గిరిజనులకు దార్తి ఆభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ – 2025 పథకం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి దార్తి ఆభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ – 2025 పథకం అమలుపై మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో నిర్వహించే ఈ కార్యక్రమంపై గిరిజనులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జూన్ 15 నుంచి 30 వరకు జిల్లాలో విస్తృత ప్రచార అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అదే సందర్భంలో జిల్లాలోని గిరిజనులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పిఎం కిసాన్, జన్‌ధన్ అకౌంట్లను తప్పనిసరిగా ఇప్పించాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను, ఎంపిడిఒలును, తహశీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమాలపై ఎప్పటికప్పుడూ సమీక్ష నిర్వహించుకొని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గిరిజనుల లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె : ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన రెండవ అంతర్జాతీయ సదస్సు ఘనవిజయం సాధించింది. దేశ విదేశాల నుండి పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, మొత్తం 100 పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. వీటిలో 80 పత్రాలు ఎంపికై ఐఎస్బియన్ నంబరుతో కూడిన సదస్సు గ్రంథంలో ప్రచురించబడ్డాయి. ఈ సదస్సులో మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రిప్టోగ్రఫీ, నానో టెక్నాలజీ, మెటీరియల్ సైన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విస్తృతంగా చర్చలు జరిగాయి. దుబాయ్, ఐర్లాండ్ వంటి విదేశాల పాటు భారత్ లోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పరిశోధకులు తమ అధ్యయనాలను వెల్లడించారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటి తిరుపతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు యువ పరిశోధకులకు ప్రేరణగా నిలుస్తాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధికి పరిశోధన ఎంతో అవసరం విద్యార్థులు నూతన అభ్యాసాలపై దృష్టి పెట్టాలి అని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థులకు పరిశోధనపై ఆసక్తి కలిగించేలా ఉండి భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి పరిశోధనలకు మార్గం వేస్తుంది అని అభిప్రాయపడ్డారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ సదస్సు కోసం శ్రమించిన పరిశోధకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ టి.అమర్నాథరెడ్డి, వై.అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రీకౌంటింగ్ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

చింతపర్తి మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికపై

హైకోర్టు ఆదేశాలతో రీకౌంటింగ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని చింతపర్తి మేజర్ పంచాయతీ ఎన్నికల రీకౌంటింగ్‌ను హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించినట్లు స్థానిక ఎంపిడిఒ మనోహర రాజు తెలిపారు. 2021లో పంచాయతీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అప్పటి వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి శ్రీనాథరెడ్డి ఓడిపోగా, టిడిపి అభ్యర్థి మహిత 53 ఓట్లతో సర్పంచ్‌గా గెలుపొందారు. దీనిపై వైసిపి సర్పంచ్ అభ్యర్థి శ్రీనాథరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు అడ్వకేటు కమిషనర్ ఆనందకుమార్ సమక్షంలో ఎన్నికల రీకౌం టింగ్ జరపాలని హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం అడ్వకేట్ కమీషనర్ ఆనంద్‌కుమార్ సమక్షంలో అధికారులు రీకౌంటింగ్‌ను నిర్వహించారు. రీకౌం టింగ్‌లో 145 ఓట్లు టిడిపి అభ్యర్థి మహితకు అధికంగా రావడంతో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. రీకౌంటింగ్ సందర్భంగా సిఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఐదు మంది ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిపిఒ మస్తాన్, డిఎల్‌పిఒ నాగరాజు, ఇఒఆర్‌డి సుధాకర్‌రెడ్డి, ఇఒ రవీంద్రనాథ్, ఎపిఒ సునీల్, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే టిబి నియంత్రణ సాధ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అవగాహనతోనే క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా నియంత్రించవచ్చునని బొమ్మనచెరువు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫుర్హాన్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని ఈశ్వరమ్మ కాలనీ, నీరుగట్టువారిపల్లి టమోటా మార్కెట్ యార్డ్‌లో ఆంధ్రప్రదేశ్ కళాజాత ప్రచార సభ్యులు చే మదనపల్లె టిబి యూనిట్ విభాగం, ఆర్ఆర్ఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షతన బొమ్మనచెరువు పిహెచ్‌సి, అమ్మచెరువుమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫుర్హాన్‌ఖాన్, ఆరోగ్య సిబ్బంది టిబి వ్యాధి మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో అన్ని జిల్లాలలో వంద రోజుల టిబి క్యాంపెయిన్‌ను ప్రవేశ పెడుతుందన్నారు. క్షయ లక్షణాలు కలవారు, బిఎంఐ 18 కన్నా తక్కువ ఉన్నవారు, సుగర్ వ్యాధి గ్రస్తులు, స్మోకర్స్, గత 5 ఏళ్లలో టిబి వచ్చి నయం అయిన వారికి స్క్రీనింగ్ చేసి గళ్ళ పరీక్ష కొరకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం 100 రోజుల పాటు అన్ని గ్రామాల్లో పట్టణాల్లో జరుగుతుందనితెలిపారు. కళాజాత కళాకారులు టిబి వ్యాధి ఒక సంక్రమణ వ్యాధి అని, అది సంక్రమించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రెహమాన్, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఆర్ఆర్ఎస్ స్వచ్ఛంద సంస్థ పురుషోత్తం, టిబి విభాగం సిబ్బంది ప్రభాకర్, సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



టిబిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, కళాజాతా బృందం



పేపర్ మిల్లు సందర్శనలో మిట్స్ విద్యార్థులు

పేపర్ మిల్లును సందర్శించిన ‘మిట్స్’ విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె : మదనపల్లెకు సమీపంలోని మిట్స్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం మూడో సంవత్సరం విద్యార్థులు పరిశ్రమల సందర్శనలో భాగంగా మొలకలచెరువు ప్రాంతంలో ఉన్న ఆత్మిక పేపర్ మిల్లును సందర్శించారని ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ పరిశ్రమ సందర్శన విద్యార్థులకు పరిశ్రమల్లో జరుగుతున్న యాంత్రిక పనితీరు, తయారీ ప్రక్రియలు, మెషిన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రాయోగిక అవగాహన కలిగించడమే లక్ష్యంగా సాగిం దన్నారు. పేపర్ ప్రాసెసింగ్, రీసైక్లింగ్ టెక్నాలజీ, హీట్ ఎక్స్చేంజర్లు, బాయిలర్ వ్యవస్థలు వంటి ముఖ్యమైన రంగాలపై విద్యార్థులు స్వయంగా పరిశీలించి అవగాహన పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ సభ్యులు పూజారి రాజేష్ పాల్గొన్నారు. పరిశ్రమ యాజమాన్యం తరపున ఇంజినీర్లు విద్యార్థులకు యంత్రాల పనితీరు, సురక్షిత ప్రమాణాలు, నిర్వహణ పద్ధతులపై వివరణ ఇచ్చారు. ఈ సందర్శన విద్యార్థుల్లో పరిశ్రమలపై ఆసక్తిని పెంపొందించేలా, తాత్విక జ్ఞానాన్ని ప్రాయోగిక అనుభవంతో మేళవించేలా సాగినట్టు అధ్యాపకులు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా హౌసింగ్ స్కీం : ఇఇ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండలంలోని మాలేపాడు పంచాయతీలో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని హౌసింగ్ ఇఇ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భం జూన్ 12వ తేదీన ప్రభుత్వ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా మాలేపాడు పంచాయతీని ఎన్నుకుని గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ స్కీంలో భాగంగా గత ప్రభుత్వం గృహ నిర్మాణానికి అందిస్తున్న 1.80 లక్షలకు అదనంగా కూటమి ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్టీలకు అదనపు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం జరుగు తుందని వివరించారు. బిసి, ఎస్సిలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఇలు దీన్ దయాల్ రాజు, వెంకటరెడ్డి, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

‘రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకం’

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పటిష్ఠం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు ఎంతో కీలకమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అన్నమయ్య జిల్లాలో ఓటర్ల సవరణ – 2025, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారాలు, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా డిఆంఒ మధుసూదనరావు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలు, ప్రస్తుత సమావేశానికి సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. ఓటరు జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియ అన్నారు. 18 ఏళ్లు నిండిన ఓటర్లను నమోదు చేయడంలో రాజకీయ పార్టీలు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఓటర్ జాబితాలో డూప్లికేట్, మరణించిన ఓట్ల తొలగింపు కూడా తమ దృష్టికి తేవాలన్నారు. ప్రతి పార్టీ బూత్ లెవెల్ అసిస్టెంట్లను నియమించుకొని జాబితాను సమర్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది జనవరి 6న ప్రకటించిన 2025 ప్రత్యేక ఓటర్ల తుది సవరణ జాబితాలో మొత్తంగా 14,30,053 మంది ఓటర్లు నమోదయ్యారని పేర్కొన్నారు. పురుషులు 7,01,703 మంది, మహిళలు 7,28,220, థర్డ్ జెండర్ 130 మంది ఉన్నారని చెప్పారు. ఆ తదుపరి ఓటరు జాబితాలో నమోదు నిమిత్తం ఇప్పటివరకు జిల్లాలో అన్ని రకాల ఫారాలలో 11493 దరఖాస్తులు అందగా, 10230 దరఖాస్తులు పరిష్కరించామని, 2517 తిరస్కరించగా 1263 దరఖాస్తులు పరిశీ లించాల్సి ఉందన్నారు. వీటిని కూడా త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో తుది జాబితా ప్రకటన అనంతరం ఇప్పటి వరకు 839 మంది పురుషులు, 1051 మహిళలను ఓటర్ జాబితాలో చేర్చడం వల్ల మొత్తంగా 14,31,943 మంది ఓటర్లు నమోదయ్యారని చెప్పారు. ఇందులో పురుషులు 7,02,542 మంది, మహిళలు 7,29,271 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. జిల్లాలో 18– 19 వయసు కలిగిన యువ ఓటర్లు అంచనాగా పురుషులు 11,047, మహిళలు 8,920, థర్డ్ జెండర్ 2 మొత్తంగా 19,969 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల సవరణ, బిఎల్‌ఒలు, వివిధ రకాల ఫారాలు, తదితర అంశాలపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చునని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. కొత్తగా ఏమైనా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలి అనుకుంటే దానికి ఎన్నికల సంఘం వారు అవకాశం ఇస్తారని కూడా వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టరు నివృత్తి చేశారు. సమావేశం అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డిఆర్ఓతో కలిసి ఇవిఎంలు భద్రపరిచిన గోడౌన్ సందర్శించారు. సమావేశంలో కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రెడ్డప్పరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

మెగా యోగాను విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 28న ఐదు వేల మందితో నిర్వహించే మెగా యోగా సాధన కార్యక్రమాన్ని సమన్వయంగా విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఐసిడిఎస్ సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు హెల్పర్లు, పిహెచ్‌సి వైద్యాధికారులు, ఆశాలు, ఎఎన్ఎంలు, మండల స్పెషల్ అధికారులతో యోగాంధ్ర–2025 అమలుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల మందితో యోగా కార్యక్రమం నిర్వహించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమం పై అవగాహన కల్పించేందుకు జిల్లాలో కూడా ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 28న ఒకే వేదికపై ఐదువేల మందితో యోగా సాధన చేయడం చేయిస్తామని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యాన్ని మానసిక ప్రశాంతతను పొందవచ్చునని పేర్కొన్నారు. మండలంలో ఎంపిక చేసిన ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు ఈనెల 24 నుంచి 27 లోగా యోగా పై మూడు రోజులపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఐసిడిఎస్, వైద్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీధర్, రూపానందరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సిసిరోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమని కుడా ఛైర్మన్ ముక్కా రూపానం దరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రంగనాయుకులపేటలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన సిసిరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవస రమైన మౌలిక సదుపాయాల కల్పన అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన రవాణా సదుపాయాలు లభిస్తాయని అన్నారు. కార్యక్ర మంలో పంచాయతీ ఇఒ ప్రసాద్‌రావు, కూటమి కార్యకర్తలు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మనీ, ముత్యాల సుబ్రమణ్యం, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, ఉత్తరాది శివ, ముత్యాల కిషోర్, అమర్, నవీన్, హమరాజ్, మల్లంకొండ నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

పదవ తరగతిలో 591 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిన రేవతి అనే విద్యా ర్థికి ఇంటర్ విద్య కోసం పట్టణానికి చెందిన భోగ రవికుమార్ రూ.2లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. పుల్లంపేటకు చెందిన రేవతి నిరుపేద కుటుంబంలో జన్మించింది. తండ్రి రామచంద్రమూర్తి రేణిగుంట దగ్గర ఒక ప్రయివేట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా పేద కుటుంబంలో జన్మించినా కష్టపడి చదివి ఇటీవల రాసిన పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఆ విదార్థినికి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని ఫీజులు రవికుమారే చెల్లించినట్లు తెలిపారు. పదవ తరగతి తర్వాత కూడా చదువుకునే స్తోమత లేకపోవడంతో ఇంటర్ విద్యకు అవసరమైన రూ.లక్షలు చెల్లిస్తానని తెలిపారు. దీంతో ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆనందానికి అవధులే లేవు. తమను ఇంతగా ఆదరించి తమ బిడ్డను ఇంతవరకు ఆర్థికంగా ఆదుకుని చదివిస్తున్న భోగారవికుమార్‌కు ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఘనంగా అమర్నాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తనయుడు అమర్నాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక అమర్నాథరెడ్డి భవనంలో టిడిపి నాయకుడు దినకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ పిలుపుమేరకు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లారి కుటుంబంలో మూడవతరం నాయకులుగా అమర్నాథరెడ్డి నిత్యం ప్రజా సేవ చేస్తూ, ప్రజల మనిషిగా రాజకీయంగా ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి సీని యర్ నాయకులు మల్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ జనార్దన్ గౌడ్, మాజీ జడ్‌పిటిసి మాలతి, మాజీ సర్పంచ్ అంజమ్మ, ఎస్‌టి నాయకుడు శ్రీనివాస్ వర్మ, అవినాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు అందించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదామును శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక దుకాణాలకు నాణ్యమైన సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని గోదాము ఇన్‌ఛార్జి మల్లికార్జునబాబును ఆదేశించారు. గోదాములో నిల్వ చేయబడిన నిత్యవసర వస్తువుల తయారీ తేదీ, సరుకుల ముగింపు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్ప వని హెచ్చరించారు.అనంతరం గోదాము దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో గోదాము ఇంచార్జి మల్లికార్జునబాబు, డిటి శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పిలిలో తాగునీటి బోరు ఏర్పాటు

పజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు.. ప్రభుత్వ నిధులతో, ప్రజల దాహార్తి తీర్చేందుకు చిప్పిలిలో శుక్రవారం తాగునీటి బోరు వేశారు. ఇందులో పుష్కలంగా నీరుప డడంతోగ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు జెసిబి వేణు, చెంద్రా యుడు మాట్లా డుతూ ప్రజల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే షాజహాన్ బాషా నిర్విరామం గా పనిచేస్తున్నారని అన్నారు.



బోరులో పుష్కంగా వస్తున్న నీరు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదు పాయాల కల్పనకు అధిక ప్రాధాన్య తమిస్తున్నారని, అందులో భాగంగానే చిప్పిలిలో త్రాగునీటి బోరు వేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారని, తమ విజ్ఞప్తి మేరకు తాగునీటి కోసం బోరు వేయించిన ఎమ్మెల్యేకి చిప్పిలి గ్రామస్తులు తరపున కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ బోరుకు మోటారు అమర్చి ప్రజలకు నీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే సహకారంతో ముున్ముందు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు.

మనసు ప్రశాంతతకు యోగా ఎంతో అవసరం

ప్రజాశక్తి- కలకడ

మనసు ప్రశాంతతకు యోగా ఎంత అవసరమని మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన యోగ ఆంధ్ర శిక్షణ తరగతులలో ఆయన ముఖ్యమంత్రిగా పాల్గొన్నారు. స్థానిక ఎంపిడిఒ అబ్దుల్ రహీం, తహసిల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం మొదలుపెట్టి ప్రతి ఒక్కరు యోగ పై అవగాహన కలిగి ఉండేలా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండలంలో యోగ శిక్షణ తరగతులు ఈనెల 20వ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్ర నాయక్, ఎస్‌ఐ శంకర్ నాయక్, నోడల్ అధికారులు రాజేశ్వరి ,మురళి ,సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ఇంటి పట్టాలిచ్చారు..హద్దులు మరిచారు

- ఇంటి స్థలాల కోసం ఎనిమిదేళ్లుగా నిరీక్షిస్తున్నాం
- సొంతింటి కల నెరవేర్చాలని దళిత గ్రామాల ప్రజలు వేడుకోలు



లబ్దిదారులకు కేటాయించిన స్థలం



ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టా

ప్రజాశక్తి-గాలివీడు

జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంమైన గాలివీడులోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. సర్వే నెంబర్ 72 వెలిగల్లు పొలంలో 0.02 సెంట్ల భూమిని మండలంలోని సలాదివారిపల్లి, చుక్క మాలపల్లి, ఉత్తరగడ్డ హరిజ నవాడలకు చెందిన దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఇంటి పట్టాలు ఇచ్చారే కానీ స్థలాలు చూపిం చలేదని, పట్టాలు పేపర్లుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి పాలన తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలో రావడంతో టిడిపి ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన వారిని అనర్హులుగా గుర్తించి దళితులకు అన్యాయం చేశారని అన్నారు. ఎప్పుడో ఇంది రమ్మ, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాలనలో పక్కా గృహాలు మంజూరయ్యాయే తప్ప ఇప్పటి వరకు ఒక్క గృహం కూడా మంజూరు కాలేదని అన్నారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన ఇంటి పట్టాలు సర్వే చేసి హద్దులు వేయించుకునే లోపు టిడిపి ప్రభుత్వ పాలన ముగిసి వైసిపి అధికారంలోకి వచ్చిందని తెలపారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని పట్టించుకున్న దాఖాలాలేవని అన్నారు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టాల పొందిన లబ్ధిదారుల ఆశల చిగురించాయని అన్నారు. తమకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలం కేటాయించి సొంతింటి కలను సాకారం చేయాలని కోరుతున్నారు.

స్థలాలు చూపించండి



ఎనిమిది సంవత్సరాల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ తమకు ఇంటి స్థలం చూపించలేదు. సొంతింటి కల కలగానే మిగిలి పోయింది.ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు సహకరించి, ప్రభుత్వం నుంచి స్థలం మంజూరు చేయించి పక్కాగృహాల నిర్మాణానికి సహకరించి ఆదుకోవాలి.

-వల్లెపు సుజాత, గాలివీడు

వైసిపి ప్రభుత్వంలోనూ అన్యాయమే



జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఇంటి పట్టాలు ఇచ్చి స్థలం చూపించలేదు. గత వైసిపి ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారుకానీ మా పట్టాలకు స్థలం చూపలేదు. కూటమి ప్రభుత్వమైనా పట్టాలకు హద్దులు చూపిస్తే సొంత ఇంటిని నిర్మించుకుంటాం.ఇంటి స్థలం కోసం ఎనిమిది ఏళ్లుగా నిరీక్షిస్తున్నాం.

-కదిరమ్మ,గాలివీడు

పట్టాలు కాగితాలకే పరిమితం కాకూడదు



పట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా చూడాలి. వెలిగల్లు గ్రామ పొలం వెలిగల్లు ప్రాజెక్టు కుడివైపునుండ కొండలో పట్టా ఇచ్చారు. ప్లాట్ నెంబర్స్ వేయలేదు. హద్దులు నాటలేదు. సర్వే చేసి మా హద్దులు మాకు చూపిస్తే ఇంటి నిర్మాణాలు చేపడతాం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని న్యాయం చేయాలి.

–జ్యోత్స్న,గాలివీడు

పట్టాలు పొందిన వారికి న్యాయం చేస్తాం



జన్మభూమి మా ఊరు కింద వెలిగల్లు పొలంలో 2017, ఆగస్టు 12న ఇంటి పట్టాలు ఇచ్చారనే సమాచారం తనకు తెలియదు. కానీ లబ్దిదారులకు హద్దులు చూపించగా వారు ఇంటి నిర్మాణాలు చేపట్టక పోవడంతో ఆ స్థలం ఖాళీగానే ఉంది. ఇంటి పట్టాలు పొందిన లబ్దిదారులు తహాశీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే వారికి న్యాయం చేకూరుస్తాం.

-జె.భాగ్యలత, తహాశీల్దార్

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించాలి



బాధితులకు ఫైలేరియా కిట్లను అందిస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామాల్లోని ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి పి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌తో కలిసి ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై సిహెచ్ఒ రాజా, మలేరియా సబ్ యూనిట్ అధికారిణి కృష్ణవేణి వారికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ జిల్లాలో 274 ఫైలేరియా కేసులు ఉన్నాయని అందులో లక్కిరెడ్డిపల్లిలో 3, రాజంపేట డివిజన్ పరిధిలో 271 కేసులు ఉన్నాయని వారందరికీ ఎంఎండిపి కిట్లు అందించామని తెలిపారు. జిల్లాలో 166 రెసిడెన్షియల్ పాఠశాలలకు, వసతి గృహాలకు దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆంటీ లార్వా స్ప్రేయింగ్ జరుగుతోందని తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగులమాను వీధిలో ఫ్రైడే డ్రైడే తనిఖీ చేశారు. చేయడం సమస్యలను గుర్తించడం యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. జూన్ మలేరి యా వ్యతిరేక మాసోత్సవం ప్రారంభం ప్రారంభమవుతుందని తెలిపారు. లార్వా ఉన్నటువంటి డ్రమ్ములు, తొట్టెలు, టెంకాయ చిప్పలు ఇండ్లలో ఉన్న కూలర్స్, పాత టైర్లలో లార్వాను గుర్తించి వాటిని అబేట్ ద్వారా పిచ్చి కారి చేసి నిర్మూలించాలన్నారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల గురించి, డెంగీ, మలేరియా వ్యాధుల గురించి తీసు కోవలసిన జాగ్రత్తలను వివరించారు. నీటి నిల్వలు ఉంచుకొన్న పాత్రలు డ్రమ్ములు వారానికి ఒకసారి శుభ్రం చేసుకుని మరల నీరు నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్నవారికి రక్తపూతలను సేకరించి ప్రతి రోజూలాబ్‌కు అందిం చాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని వెక్టర్ కంట్రోల్ యాప్‌లో ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ అరోవరమ్మ, సూపర్వైజర్ మహేష్, ఫార్మసిస్ట్ బివి.కృష్ణయ్య, ఎఎన్ఎంలు మల్లపు శివరాములమ్మ, లక్ష్మీదేవి, ఆశ లక్ష్మి పాల్గొన్నారు.

సైనిక్ ఫలితాల్లో 'మురళీ' విద్యార్థుల ప్రభంజనం

- ఆలిండియా స్థాయిలో 20వ ర్యాంకు, తెలుగు రాష్ట్రాల్లో 2వ ర్యాంకు

ప్రజాశక్తి - రాయచోటి

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్, జవహర్ నవోదయ స్కూల్, రాష్ట్రీయ మిలటరీ స్కూల్ ఇలా పరీక్షలు ఏవైనా మురళి విద్యార్థులదేపై చేయి అని కరస్పాండెంట్ సరితదేవి, డైరెక్టర్ పి. వి. నాగయ్య పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు గురువారం సాయంత్రం విడుదల చేసిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని కొత్తపేటలో ఉన్న తమ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పేర్కొన్నారు. తమ స్కూల్ నుంచి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో గగన్ తేజ్ రాయల్ 300 మార్కులకు గాను 294 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 20వ ర్యాంకు తెలుగు రాష్ట్రాల్లో రెండవ ర్యాంకు సాధించి మురళి స్కూల్‌ను రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలో నిలిపారన్నారు. అలాగే లిఖి దేవాన్ష్‌రెడ్డి(285), చర్విత‌రెడ్డి(277), తేజ్ నందన్(277), నితిన్ నాయక్(273), గౌతమి(272), వెంకటప్రమోద(271), జోషిత 270 మార్కులతో 8 మంది విద్యార్థులు 270 పైబడి మార్కులు సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. 250 మార్కులకు పైబడి 25 మంది విద్యార్థులు ప్రభంజనం సృష్టించగా 200 మార్కులు పైబడి 62 మంది విద్యార్థులతో మురళీస్కూల్ ఉత్తమ ఫలితాలు సాధించి తెలుగు రాష్ట్రాల్లో ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ పరీక్ష ఫలితాలలో ఒక ప్రభంజనంలా దూసుకెళ్లిందని చెప్పారు. విద్యార్థులకు రాష్ట్ర, దేశ స్థాయిలో ఉత్తమ విద్యనందించే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం కేంద్ర విద్యా శాఖ,రాష్ట్ర



విద్యాశాఖ నిర్వహించే ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయ రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలలో మురళీ స్కూల్ విద్యార్థులు అన్ని స్థాయిలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వెల్లడించారు. ఇంతటి ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంకుతో పాటు ఆల్ ఇండియా స్థాయి 20వ ర్యాంకు సాధించిన మురళీస్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి తల్లిదండ్రుల నుండి రాయచోటి పట్టణ, నియోజకవర్గ ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. సార్ ఈ వార్త దయచేసి పెట్టగలరు యాడ్ వస్తుంది

మహానాడును విజయవంతం చేద్దాం

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కడప నగర శివారులో ఈనెల 27 నుంచి 29వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న మహానాడుకు పార్టీ శ్రేణులులక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేద్దామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గువ్వల చెరువుసమీపంలో 30 ఎకరాలలో మహానాడుకు వస్తున్న పార్టీ శ్రేణులకు భోజన వసతి, వాహనాల పార్కింగ్ ఏర్పాటులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా పిలుపును గుర్తు చేసుకుంటూ ప్రతి కార్యకర్త మహానాడు వైపు కదలి రావాలని అన్నారు. మంత్రి నాయ కులు వెంట ఆంజనేయరెడ్డి, పట్టాబిరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మహానాడు జరిగే ప్రాంతంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - తొండూరు

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని ఎస్ఐ మద్దిలేని వాహనదారులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాల పత్రాలు పరిశీలించారు. లేని వారికి జరిమానా విధించారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

వేసవి శిబిరాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి శిబిరాలు విద్యార్థుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణ భావనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎంఇఒ-2 ఎస్. ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం సమ్మర్ క్యాంపును శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్, పాటలు, సరదాతో శాస్త్రీయ విజ్ఞానం నేర్పించే కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ఇలాంటి అనుభవాలు పిల్లలలో శాస్త్రీయ దృష్టి కోణాన్ని అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ఈ దిశగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని చెప్పారు. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తుండడంతో రాబోయే రోజుల్లో మరిన్ని విభిన్న, వినూత్న అంశాలతో ఈ సమ్మర్ క్యాంపు కొనసాగిస్తామని జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం. సి.ఎస్. అంజాద్ అలీ, ఎస్ఎంసి ఛైర్మన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అబ్దుల్ గఫూర్, కామేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని మిట్టమీద పల్లిలో పత్తిపాటి రవినాయుడు ఆధ్వర్యంలో రమాదేవి ఆసుపత్రి తిరుపతి వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ప్రారంభించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించి వైద్య శిబిరంలో వైద్యులను పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం అనేది ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని, ఇలాంటి సమయంలో గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించడం నిజంగా అభినందనీయమని, అలాంటి సేవలు అందిస్తున్న రమాదేవి ఆసుపత్రి యాజమాన్యానికి, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి యూనిట్ ఇంచార్జ్, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుంజన ఏటికి రక్షణ గోడ నిర్మించాలి

- కాంగ్రెస్ నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని నరసరాంపేట ఆనుకొని ఉన్న గుంజన ఏరులో రక్షణ కూడా నిర్మించాలంటూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరవధిక నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. సంఘీభావంగా నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి గోసాదేవి పూలమాల వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి రైల్వేకోడూరు ప్రజలు వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గుంజన ఏరు ఉధృతంగా ప్రవహిస్తూ తన దిశను మార్చుకొని స్థానిక నివాసాలపైకి నిరంతరాయంగా ప్రవహిస్తోందని గత ఎనిమిది సంవత్సరాలలో ఎంతోమంది తమ ఇళ్లను, ఆస్తులను కోల్పోయి ఎటు వెళ్లాలో తెలియక తమ జీవితాలు అస్తవ్యస్తమయ్యాయనీ అన్నారు. గత ప్రభుత్వాలు ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని చెప్పి అమాయక ప్రజల ఓట్లు వేయించుకొని మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారని, తీరా గత ఎన్నికల ముందు హడావిడిగా రక్షణ కూడా నిర్మాణానికి భూమిపూజ కూడా చేపట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఇలాంటి వాగ్దానమే చేసి వచ్చిన ఆరు నెలల్లో సేఫ్టీ వాల్ నిర్మిస్తామని చెప్పి గత ప్రభుత్వాలు మాదిరిగానే సమయాన్ని వృధా చేస్తూ వస్తున్నారని అన్నారు .ప్రొటెక్షన్ వాల్ నిర్మించనిదే ఇకనుండి లేచే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేశారు. కార్యక్రమంలోకాంగ్రెస్ రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ శాంతయ్య పాల్గొన్నారు.

ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని రామాపురం ఐసిడిఎస్ క్లస్టర్ సూపర్వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికల వికాసంలో భాగంగా విద్యా కేరీర్, మార్గదర్శకం, నైపుణ్యం అనే అంశంపై 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల బాలికలకు అవగాహన కల్పించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యలో రాణించాలని, విలియం సునీత లాంటిఉన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆడపిల్లలు పదవ తరగతి లోపల బడి మానేస్తున్నారని, మరల విద్యను కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ లాంటి ఉపయోగించుకొని ముందుకు సాగి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, సుబ్బలక్ష్మమ్మ కిశోర బాలికలు పాల్గొన్నారు.

రేషన్‌షాప్‌లో సూచిక బోర్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

రేషన్‌షాపుల వద్ద సూచిక బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలని తహశీల్దార్ రమాకుమారి డీలర్లకు సూచించారు. మండల పరిధిలోని డీలర్లతో శుక్రవారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ నుంచి రేషన్‌షాపుల వద్దనే నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. గతంలో వాహనాల ద్వారా ఇంటింటిధరల పట్టిక, స్టాక్ ఎప్పటికప్పుడు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. రేషన్‌షాపుల పర్యవేక్షణను కొంతమంది సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, విఆర్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విగ్రహాల తయారీ కూలీ అదృశ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విగ్రహాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కూలీ అదృశ్యమయ్యాడు. ఈ విషయంపై యజమాని ఆదిలోకేష్‌కుమార్ శుక్రవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు దారుడు మాట్లాడుతూ తట్టివారిపల్లి సర్కిల్, తిరుపతి రోడ్డులోని లహరి స్విమ్మింగ్ పూల్ ఎదురుగా తనకు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసే పరిశ్రమ ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ నుంచి వచ్చిన నలుగురు యువకులు పనిలో చేరారని తెలిపారు. వీరిలో రాకేష్ కుమార్ మెగ్వాల్ అనే యువకుడు రెండు రోజుల క్రితం బయటికి వెళ్లి వస్తానని తిరిగి రాలేదన్నారు. అతని స్నేహితులు, సన్నిహితంగా ఉన్నవారి వద్ద ఆరా తీసిన యువకుడు ఆచూకీ లభించలేదన్నారు. ఈ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేసి ఆనంతరం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై తాలూకా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ పాస్ పుస్తకాలు జారీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల వ్యాప్తంగా రైతుల వద్ద నుంచి భూమికి పాస్ పుస్తకాలు చేయిస్తానని చెప్పి దొంగ పాసు పుస్తకాలు జారీ చేయించిన కేసులో పూజారి నాగన్న అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాయచోటి కోర్టు లో హాజరు పరచగా14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-రామాపురం

మండలం కుమ్మరపల్లి పంచాయతీ సురకవాండ్లపల్లిలో ఇంటి స్థల విషయంలో తనకు న్యాయం జరగలేదనే ఆవేదనతో నందలూరు బసిరెడ్డి(70) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.మృతుడి కుమారుడు రామాంజనేయులురెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.